క్లుప్తంగా

14 నుంచి కార్తిక మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ఈ నెల 14 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు గోపూజ, ప్రథమ అభిషేకంతో కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజూ స్వామివారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏక రుద్రాభిషేకం, నవగ్రహాలకు అభిషేకం, విశేష హారతులు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతాయని చెప్పారు. ఈ నెల 17న నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు విశేష అభిషేకం జరుగుతుందన్నారు. 26న కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని లక్ష బిల్వార్చన, జ్వాలాతోరణం నిర్వహిస్తామని వెల్లడించారు. వచ్చే నెల 11న మాసశివరాత్రి సందర్భంగా శివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామివార్ల కళ్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు కార్తిక మాసోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు పారాయణం జరిగింది. భజన బృందం సభ్యులు, లచన్ ఇన్‌ఫ్రా మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు దాసాంజనేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సుప్రసిద్ధ మాచవరం దాసాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారిణి నాగినేని భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులు, సేవా సమితి సభ్యుల సమక్షంలో ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు సాంప్రదాయ దుస్తులతో హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

సర్ సీవీ రామన్ జయంతి

పాయకాపురం(విజయవాడరూరల్): భౌతిక శాస్త్ర శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతి కార్యక్రమాన్ని శ్రీపుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మైనం హుస్సేన్ మాట్లాడుతూ రామన్ పేరుతో ఆయన కనుగొన్న రామన్ ఎఫెక్ట్‌ని గుర్తిస్తూ భారత ప్రభుత్వం సైన్స్‌డే నిర్వహిస్తోందన్నారు. సీవీ రామన్ భౌతికశాస్త్ర సాంకేతిక రంగానికి చేసిన సేవలకు గానూ నోబెల్ బహుమతి వచ్చిందని తెలిపారు. స్కాట్రింగ్ ఆఫ్ లైట్ ద్వారా ఆయన చేసిన ప్రయోగాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలుసుకోవడం జరిగిందని హెచ్‌ఎం అన్నారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు రేణుక, రాధిక, శేఖర్, సత్యవతి, సునంద, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి జరిమానా



పటమట(విజయవాడతూర్పు): రోడ్లపైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం పలువురికి జరిమానా విధించారు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో జరిగిన కేసుల విచారణలో 14 కేసులపై విచారణ జరిపి వారికి రూ.5160 జరిమానా విధించారు. మరోసారి నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్–2, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్–2 కె.ఆర్. నవ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

రైళ్లలో పేలుడు పదార్థాలు తీసుకెళ్తే కఠిన చర్యలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణంలో పేలుడు పదార్థాలు, బాణసంచా, మండే స్వభావం ఉన్న వస్తువులు తీసుకు వెళ్లడం చట్ట ప్రకారం నేరమని, అందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. దీపావళి సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌పీఎఫ్ పోలీసులు, జీఆర్‌పీ పోలీసుల సహకారంతో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమతో పాటు బాణసంచా, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, పెట్రోల్, కిరోసిన్, ఎండు గడ్డి, ఆకులు, థర్మిక్ వెల్డింగ్ తదితర వస్తువులు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అందుకు పాల్పడిన వారిపై రైల్వేచట్టం సెక్షన్ 164 ప్రకారం శిక్షార్హమైన నేరం అన్నారు. అందుకు పాల్పడితే మూడేళ్ల జైలు శిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. రైలులో ప్రయాణికులు ఇటువంటి వస్తువులను తమతో పాటు తీసుకువెళ్తున్నట్లు గుర్తిస్తే తోటి ప్రయాణికులు డయల్ 139 లేదా రైల్ మదద్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోలీసులు సకాలంలో స్పందిస్తారని తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్‌లో రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్, 64వ డివిజన్ బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్లో జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరాల్లో ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. శిబిరాలకు హాజరైన వారితో మాట్లాడి వైద్య సదుపాయాలు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో దీర్ఘకాలిక వ్యాధులను సైతం పరిష్కరించే దిశగా అనుభవం ఉన్న వైద్యుల ద్వారా ప్రజలకు చికిత్స అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా పూర్తి స్థాయిలో అన్ని రకాల పరీక్షలు చేసి, ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు అందిస్తున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుదారుల సౌలభ్యం కోసం ఓ మొబైల్ యాప్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలన్నింటినీ సద్వినియోగపర్చుకుని ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ, డివిజన్ కో–ఆర్డినేటర్లు పసుపులేటి యేసు, షేక్ ఇస్మాయిల్, పార్టీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, సీహెచ్ రవి, టిక్కం కృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో....

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 31వ డివిజన్ గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధపడకూడదనే మహోన్నత ఆశయంతో ప్రతి ఇంటికీ వెళ్ళి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం, డివిజన్ కో–ఆర్డినేటర్ పట్టాభి రామరాజు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో....

32వ డివిజన్ అయోధ్యనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి గుండే సుందర్‌పాల్‌తో కలిసి ఎమ్మెల్యే విష్ణు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య శిబిరంలో అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26వ డివిజన్‌లో....

26వ డివిజన్ మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన జగనన్న శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.



32వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న మల్లాది విష్ణు

స్వరఝురులు కురిపించిన అమృతవెంకటేష్ గాత్రం



కచేరీ నిర్వహిస్తున్న అమృతవెంకటేష్, వాద్య సహకారం అందిస్తున్న రామకృష్ణన్, అర్జున్‌గణేష్

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ 30వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సంగీత సద్గురువుల వైభవాన్ని చాటుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన అమృతవెంకటేష్ నిర్వహించిన కచేరీ స్వరఝురులను కురిపించింది. వర్ణంతో ప్రారంభించి త్యాగరాజస్వామి రచించిన ఆరగింపవే పాలారగింపవే, ఏమయ్య రామా తదితర కీర్తనలను ఆలపించారు.

వయొలిన్‌పై ఎల్.రామకృష్ణన్, మృదంగంపై అర్జున్‌గణేష్ సహకరించారు. కార్యక్రమంలో సంగీత సభ ఉపాధ్యక్షుడు జే ప్రభాకరశాస్త్రి, బీ హరిప్రసాద్, కోశాధికారి బీఎస్ఎస్ ప్రసాద్‌శర్మ, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు సాయంత్రం 6.30 నిమిషాలకు విష్ణుభొట్ల సరస్వతి, విష్ణుభొట్ల కృష్ణవేణి గాత్రయుగం నిర్వహిస్తున్నట్లు సంస్థ సభ్యురాలు గాయత్రీ గౌరీనాథ్ తెలిపారు.

ఉలుకెందుకో..

- బోగస్ ఓట్లపై ఎన్నికల అధికారికి వైఎస్సార్ సీపీ ఫిర్యాదు
- 'తూర్పు'లో 20 వేలకు పైగా దొంగ ఓట్లు
- టీడీపీ కార్పొరేటర్‌కు రెండు ఓట్లు
- పెనమలూరు, గన్నవరంలో ఉన్న వారికి తూర్పులోనూ ఓట్లు
- దొంగ ఓట్లతోనే 2014, 2019లో 'గద్దె' గెలుపు!
- ఫిర్యాదుపై పచ్చపత్రికల్లో అసత్య కథనంపై ఆగ్రహం



రెండుచోట్ల ఓటు ఉన్న టీడీపీ కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): వారికి సొంత గ్రామాల్లోనూ ఓటు ఉంది.. నగరంలోని 'తూర్పు' నియోజకవర్గంలోనూ ఓటు ఉంది. ఇలా టీడీపీకి చెందిన అనేక మంది బోగస్ ఓట్లు 'తూర్పు'లో ఉన్నాయి. వేర్వేరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న వారు సైతం ఇక్కడ ఓట్లు నమోదు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏకంగా 20 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉండటంతో వాటిపై విచారణ జరిపి, రెండు ప్రాంతాల్లో ఓట్లు కలిగిన వారివి తొలగించాలని ఎన్నికల అధికారికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఫిర్యాదు చేశారు. దీంతో 2014, 2019లో దొంగ ఓట్లతో నెగ్గారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఉలిక్కిపడ్డారు. తమ పచ్చపత్రికలో ఓట్లు తొలగింపు అంటూ తప్పుడు కథనాలు రాయించడానికి బరితెగించారు.

వివరాలిలా....

తూర్పు నియోజవర్గంలో 20 వేల వరకూ బోగస్ ఓట్లు ఉన్నట్లు అవినాష్ ఫిర్యాదు చేశారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లోని గ్రామాలకు చెందిన పలువురికి వారి గ్రామాల్లో ఓట్లు ఉండగా, వారికి విజయవాడ తూర్పులో కూడా బోగస్ ఓట్లు ఉన్నాయి. కొందరికి హైదరాబాద్‌లో ఓట్లు ఉండగా, ఇక్కడ కూడా ఉన్నాయి. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల ప్రకారం ఏదైనా ఒకచోటే ఓటు హక్కు ఉండాలి. ఆయా ప్రాంతాల్లోనే వారు నివసిస్తున్నారని, కానీ ఇక్కడ చట్ట విరుద్ధంగా రెండో ఓటు కలిగి ఉన్నట్లు గుర్తించారు.

దొంగ ఓట్లతోనే గెలిచారు.



'తూర్పు'లో 20 వేలకు పైగా బోగస్ ఓట్లు ఉన్నాయి. ఇక్కడి నుంచి గద్దె రామ్మోహన్ 2014, 2019లో ఆ దొంగ ఓట్లతోనే గెలిచారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో గ్రామాల వారిని ఇక్కడ ఓటర్లుగా చేర్పించారు. దొంగఓట్ల అంశాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తూర్పులో దొంగ ఓట్ల ప్రక్షాళన చేస్తాం. దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది వారి ప్రవర్తన. పచ్చ పత్రికల్లో అసత్య ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యేనే ఇలాంటి తప్పులకు పాల్పడుతున్నారు. అడ్డదారులతో తాము ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం లేదు. టీడీపీకి 60 చోట్ల ఇన్‌చార్జులు లేరు. ఆ విషయం లోకేష్ అన్నారు. ఇసుక, మద్యం పాలసీలో చంద్రబాబు ప్రభుత్వం జేబులు నింపుకుంది. 2024లో వైఎస్సార్ సీపీ 175 సీట్లూ గెలుస్తుంది.

దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి

టీడీపీ కార్పొరేటర్‌కే రెండు ఓట్లు

పటమట ప్రాంతానికి చెందిన తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీకి రెండు ఓట్లు ఉన్నాయి. ఆమెకు 64–6–11ఎ చిరునామాలో ఒకచోట, 40–25–6లో మరో ఓటు కలిగి ఉన్నారు. ఇలా అనేక ఓట్లు ఉండటంతో అలాంటి వాటినే తొలగించాలని ఫిర్యాదు చేశారు. బోగస్ ఓట్లు టీడీపీకి చెందిన వారివే కావడం విశేషం. దీనిపై విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు.

ఘనంగా కాణిపాక వరసిద్ధి వినాయక కల్యాణం



వరసిద్ధి వినాయకస్వామి కళ్యాణోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శ్రీ కాణిపాక సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి కళ్యాణ మహోత్సవం సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత వైభవోపేతంగా మంగళవారం జరిగింది. అశేష భక్త జన సందోహం వీక్షిస్తుండగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వినాయకుడితో పాటు సిద్ధి, బుద్ధి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలు పోశారు. అనంతరం మహిళలు స్వామివారితో పాటు సిద్ధి, బుద్ధి అమ్మవార్లకు ఒడిబియ్యాన్ని పోసి, పూజలు నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. హిందూ ధర్మ పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారని తెలిపారు. మహా గణాధిపతి ఆశీస్సులు ప్రభుత్వంపై ఎల్లవేళలా ఉండాలని, స్వామివారి కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తి, గాయత్రీ సొసైటీ ప్రెసిడెంట్ ఈశ్వర్, సెక్రటరీ హరికుమార్, జేకే సుబ్బారావు,పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్షా సమావేశం



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సెంట్రల్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అయిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన చాంబర్‌లో పొలిటికల్ రివ్యూ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. పొలిటికల్ పార్టీ ప్రతినిధులు ఓటర్ల జాబితా విషయంలో తమ అభ్యర్థనలు కమిషనర్‌కు చెప్పగా ఓటర్ల జాబితా పారదర్శకంగా జరగాలని ఎటువంటి తప్పులు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. సెంట్రల్ నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు వై సుందర్‌పాల్ (వైఎస్సార్ సీపీ), బీ ఉమామహేశ్వరరావు(టీడీపీ), ఎం సాంబశివరావు(టీడీపీ), ఎం వినోద్‌కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), సిటీ ప్లానర్ జీవీ జీఎస్‌వి ప్రసాద్, జెడ్ సి–2 మల్యాద్రి, తహసిల్దార్ సెంట్రల్ వెన్నెల శ్రీను, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) కే రామ్మోహన్‌రావు, ఏసీపీ–2 ఎం జగదీష్, నార్త్ తహసిల్దార్ ఎం మాధురి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన అవుతు సుబ్బారెడ్డి(44) గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు, మృతునివద్ద మద్యం బాటిల్స్ వున్నట్టుగా భవానీపురం ఎక్సైజ్‌శాఖ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంలో మనస్తాపం చెందిన మృతుడు ఈ నెల 5న గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆంధ్రా హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్ళగా చికిత్స పొందుతూ సుబ్బారెడ్డి మృతి చెందాడు. మృతుని తండ్రి సాంబరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానస్పద కేసుగా నమోదు చేశారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

- కలెక్టర్ ఢిల్లీరావు
- నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం మూడో ఆప్షన్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై కలెక్టర్ ఢిల్లీరావు.. విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ల వారీగా మ్యాప్ చేసిన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 10,991, తూర్పుకు సంబంధించి 7,781, పశ్చిమకు సంబంధించి 9,608 ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. నిర్మాణాల్లో సరైన పురోగతి చూపని కాంట్రాక్టర్లపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి.. తగిన పరిష్కారం చూపి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రజనీకుమారి, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా కండ్రిక

రూ. 4.45కోట్లతో అభివృద్ధి పనులు



కండ్రిక నుంచి కండ్రిక కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతమైన విలేజి కండ్రిక అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేగా మల్లాది విష్ణు విలేజి కండ్రికపై ప్రత్యేక శ్రద్ధ చూపడం, 64వ డివిజన్ కార్పొరేటర్‌గా స్థానిక మహిళ యరగొర్ల తిరుపతమ్మ కావడంతో కండ్రిక ప్రాంతం అభివృద్ధి పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలు కూడా సంపూర్ణంగా అందుతున్నాయి. ఈ ప్రాంతంలో కేవలం రెండు వేల జనాభా మాత్రమే వుంది. వీరిలో ఎక్కువ వ్యవసాయ కుటుంబాలు కావడం విశేషం. విలేజి కండ్రికలో జరిగిన అభివృద్ధి పనులు ఒకసారి పరిశీలిస్తే... పోలవరం కాల్వ నుంచి రైతుల పొలాలకు సాగునీరు అందించేందుకు అండర్‌పాస్ రూ. 35లక్షలతో నిర్మాణం జరిగింది. దీంతో పొలాలకు నీటి సమస్య తీరిపోయింది. ఒకప్పుడు కర్మలభవనం లేక రోడ్డుపైనే ఇబ్బంది పడే పరిస్థితి వుండేది. ప్రస్తుతం రూ. 20లక్షలతో కర్మలభవనం నిర్మాణం చేశారు. వీఎంసీ నుంచి నేరుగా మంచినీరు వచ్చేవిధంగా, ఒకవేళ ఎప్పుడైనా వీఎంసీ నీరు రాకపోతే అత్యవసర పరిస్థితిలో ప్రత్యామ్నయంగా నీటిసరఫరా కోసం రూ.10లక్షలతో పవర్ బోరు ఏర్పాటు చేశారు. అలాగే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 24లక్షలతో రోడ్లు, డ్రైన్లు నిర్మాణం జరిగింది. వాటర్‌ట్యాంక్ నుంచి కర్మలభవనం వరకు రూ. 2.5లక్షలతో పైపులైన్ నిర్మాణం చేశారు. నగరానికి ఏమాత్రం తీసిపోని విధంగా రూ.3.5లక్షలతో నిర్మించిన హేమాస్ట్ లైటింగ్‌ను ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందిగా వుండే విలేజి కండ్రిక నుంచి విజయవాడ నగరంలోకి వెళ్ళేందుకు వీలుగా మైనింగ్ గ్రాంటు రూ. 3.5కోట్లతో 15 నుంచి 24 అడుగుల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి.

వేగంగా అభివృద్ధి పనులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విలేజి కండ్రిక అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే మనసున్న మారాజు అని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

– యరగొర్ల తిరుపతమ్మ, కార్పొరేటర్

కేబీఎన్‌లో డిగ్రీ నాలుగో ఏడాది కోర్సులను వినియోగించుకోండి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాలలో కొత్తగా ప్రవేశపెట్టిన డిగ్రీ నాలుగో ఏడాది కోర్సులను విద్యార్థులు వినియోగించుకోవాలని ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నాలుగో సంవత్సరం డిగ్రీ కోర్సుకు సంబంధించి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (స్టాటిస్టిక్స్), బీఎస్సీ (ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (డేటా సైన్స్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం (బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్), బీకాం (హెచ్ఆర్ అండ్ మార్కెటింగ్) కోర్సులకు సంబంధించి నాలుగో ఏడాది కోర్సుకు దరఖాస్తులనుఆహ్వానిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ సంబంధిత కోర్సులో మూడు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసుకొని, అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులన్నారు. కోర్సులో చేరే విద్యార్థులకు సాధారణ డిగ్రీ విద్యార్థులకు అందే ప్రభుత్వ పథకాలు వస్తాయని వివరించారు. నాలుగో సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన వారికి పీజీ ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే అవకాశముంటుందన్నారు. మరింత సమాచారానికి కళాశాల కార్యాలయంలోగానీ, 9182907747 నంబర్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.